


గురవమ్మకు సిపిఎం నేతల పరామర్శ

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి



కేరళలో జరిగిన ఆల్ ఇండియా మహిళా సమాఖ్య సదస్సుకు వెళ్లి తీవ్ర అనారోగ్యం బారిన పడి ప్రస్తుతం ఇంటి వద్ద కోలుకుంటున్న వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యురాలు గురవమ్మను గురువారం సిపిఎం నేతలు పరామర్శించారు. ఆమె యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకుని ప్రజా పోరాటాల్లో పాలుపంచుకోవాలని ఆకాంక్షించారు. సిపిఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు అంగేరి పుల్లయ్య, కందారపు మురళి, శ్రీకాళహస్తి ప్రాంతీయ కార్యదర్శి గంధం మణి, పెనగడం గురవయ్య, వెంకటేష్, బాలకృష్ణ, రాధాక్రిష్ణ, ఎన్‌డి శ్రీను తదితరులు ఉన్నారు.



తిరుపతి ఇందిరా మైదానంలో సభకు హాజరైన యువత

పెరియార్ చిత్రపటాల తొలగింపు గర్హనీయం

తిరుపతి సిటి : 'దక్షిణాసియా దేశాలపై ట్రంప్ పెత్తనమేంటి?' అని సిపిఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డి.రాజా ప్రశ్నించారు. ట్రంప్‌కు భారత ప్రధాని తలొగ్గి వ్యవహరించడాన్ని తప్పుబట్టారు. సిపిఐ కార్యాలయంలో గురువారం మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఏఐవైఎఫ్ జాతీయ మహాసభల సందర్భంగా తిరుపతి నగరంలో పెరియార్ సిద్ధాంతంతో కూడిన చిత్రపటాలను ఏర్పాటు చేస్తే పోలీసులు వాటిని తొలగించడం శోచనీయం అన్నారు. పెరియార్ ద్రవిడ ఉద్యమానికి, సామాజిక న్యాయం కోసం చేసిన పోరాటం చంద్రబాబుకు తెలియదా? అని ప్రశ్నించారు.

నిరుద్యోగ యువతకు...

రూ.3వేలు ఎప్పుడిస్తారు..?

- ఏడాదికి 2 కోట్ల ఉద్యోగాలు ఏమయ్యాయి..?
- 'ఎఐవైఎఫ్' జాతీయ మహాసభలు ప్రారంభం

ప్రజాశక్తి - తిరుపతి సిటి

'ఎన్నికల ముందు నిరుద్యోగ భృతి రూ.3వేలిస్తానని ప్రకటించిన చంద్రబాబునాయుడు, అధికారంలోకి వచ్చి ఏడాదైనా ఊసే లేదని, ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని ప్రగల్భాలు పలికిన మోడీ, పదేళ్లలో ఎన్ని ఉద్యోగాలు ఇచ్చారో చెప్పాలి' అని వక్తలు డిమాండ్ చేశారు. ఎఐవైఎఫ్ జాతీయ మహాసభలు తిరుపతి వేదికగా గురువారం ప్రారంభమయ్యాయి. సాయంత్రం తిరుపతి ఇందిరా మైదానంలో బహిరంగసభ జరిగింది. ముఖ్య అతిథులుగా సిపిఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డి.రాజా, జాతీయ కార్యదర్శి కె.నారాయణ, రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ విచ్చేశారు. ఎఐవైఎఫ్ జాతీయ అధ్యక్షులు సికిందర్ సింగ్ మహేశ్వరి అధ్యక్షతన బహిరంగసభ జరిగింది. ఈ సందర్భంగా ప్రధాన వక్తలు మాట్లాడుతూ ఉపాధి హక్కును ప్రాథమిక హక్కుగా చేర్చాలని డిమాండ్ చేశారు. భగత్‌సింగ్ జాబ్‌గ్యారంటీ యాక్ట్‌ను తక్షణం అమలు చేయాలన్నారు. విద్యార్థి నిరుద్యోగ వ్యతిరేక విధానాలను అవలంభిస్తున్న నరేంద్ర మోడీని సాగనంపేందుకు యువత నడుం బిగించాలని కోరారు. 'సేవ్ ఇండియా ఛేంజ్ ఇండియా' పేరుతో దేశవ్యాప్తంగా బలమైన ఉద్యోమాన్ని నిర్మించాలని పిలుపునిచ్చారు. రాజ్యసభ సభ్యులు సంతోష్‌కుమార్, ఎఐవైఎఫ్ జాతీయ ప్రధాన కార్యదర్శి తిరుమలరామన్, రాష్ట్ర అధ్యక్షులు రాజేంద్రబాబు పాల్గొన్నారు. ఎఐవైఎఫ్ జాతీయ మహాసభలు తిరుపతిలో నాలుగు రోజుల పాటు జరగనున్నాయి. ఎఐవైఎఫ్ జాతీయ ఆఫీస్ బేరర్స్ వలి ఉల్లా కాదని, ఖాదర్, సిన్హా ప్రతాప్ సిపిఐ జిల్లా కార్యదర్శి మురళి పాల్గొన్నారు.

రానున్నాయ్ ..ఐఐటి 'ఇన్నోవేషన్స్'

ఫేజ్-2కు రూ. 2313 కోట్ల బడ్జెట్
30 ఏళ్లలో 15 వేల సీట్లు అదనం
డైరెక్టర్ డాక్టర్ సత్యనారాయణ వెల్లడి

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి

రానున్న రోజుల్లో తిరుపతి ఐఐటీ మరిన్ని నూతనావిష్కరణలకు కేంద్ర బిందువు కానుందని డైరెక్టర్ ప్రొఫెసర్ డాక్టర్ సత్యనారాయణ అన్నారు. పరిశ్రమలు-విద్యా సంస్థల మధ్య అనుసంధానం పెంచేందుకు, విద్యార్థులు మెరుగైన పరిశోధనలు చేసేందుకు వీలుగా అత్యాధునిక రీసెర్చ్ పార్కులు ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. ఏర్పేడులో ఉన్న తిరుపతి ఐఐటీలో డైరెక్టర్ సత్యనారాయణ గురువారం మీడియా సమావేశం నిర్వహించి మాట్లాడారు. దేశవ్యాప్తంగా ఉన్న ఐఐటీలను మౌళిక, శాస్త్ర, సాంకేతిక రంగాల్లో మరింత అభివద్ధి చేసేందుకు కేంద్ర ప్రభుత్వం కత నిశ్చయంతో ఉందన్నారు. ఇందులో భాగంగా ఐదు నూతన ఐఐటీలకు బడ్జెట్లో సుమారు రూ. 13 వేల కోట్లు మంజూరు చేసిందని తెలిపారు. తిరుపతి ఐఐటికి రెండో దశ నిర్మాణ పనులకు గాను నాలుగేళ్ల పరిమితికి(2025-29) రూ.2313 కోట్లు మంజూరు చేసినట్లు వెల్లడించారు. రెండో దశ ఐఐటి నిర్మాణ పనులు పూర్తయితే ఇప్పుడున్న 1200 సీట్లకు అదనంగా మరో 1300 మంది విద్యార్థులకు ఇక్కడ చదువుకునే అవకాశం ఏర్పడుతుందని అన్నారు. అంతిమంగా మరో 30 ఏళ్లలో 15 వేల మంది విద్యార్థులు ఒకేసారి ఐఐటి కోర్సులు పూర్తిచేసేలా వసతులు కల్పించనున్నామని స్పష్టం చేశారు. ఐఐటీలో ప్రస్తుతం 317 మంది పీహెచ్డీ విద్యార్థులు ఉండగా ఆ సంఖ్య 600కు పెరిగే అవకాశం ఉన్నట్లు చెప్పారు. పరిశ్రమలు-విద్యా సంస్థల మధ్య అనుసంధానం పెంచి జాతికవసరమైన పరిశోధనలు చేసేందుకు ఐఐటికి చెందిన 19 ఎకరాల్లో ఇన్నోవేషన్ పార్క్, అత్యాధునిక మేకర్స్ ల్యాబోరేటరినీ ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ఐసర్ సంస్థ కూడా ఇందులో భాగస్వామ్యం వహిస్తుందని చెప్పారు. కియా మోటార్స్ తో రూ. 35 కోట్ల ఒప్పందం, రతన్ టాటా ఇన్నోవేషన్ కేంద్రం ఇందులో కీలకమైనవని చెప్పారు. కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న 230 జాతీయ మిషన్ కార్యక్రమాల్లో తిరుపతి ఐఐటీ భాగస్వామ్యం వహిస్తోందని వివరించారు. శాస్త్ర, సాంకేతిక రంగ ఫలాలు అందుకు అవసరమైన అన్ని కార్యక్రమాలను తిరుపతి ఐఐటి చేపడుతుందని డాక్టర్ సత్యనారాయణ స్పష్టం చేశారు. డీన్ లు శశిధర్ గుమ్మా, అనిల్ కుమార్, మురళీ కష్ణ పాల్గొన్నారు.



విలేకరులతో ప్రొఫెసర్ సత్యనారాయణ

'స్థానిక' సంస్థలకు నిధులు కేటాయించాలి

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

స్థానిక సంస్థల మౌలిక సదుపాయాల కల్పన, అభివృద్ధికి నిధులు కేటాయించాలని 16వ ఆర్థిక సంఘం సభ్యులు సౌమ్యకంతి ఘోష్‌ను స్థానిక, పట్టణ ప్రతినిధులు కోరారు. గురువారం తాజ్ హోటల్లో స్థానిక సంస్థల అభివృద్ధి పనుల్లో భాగంగా శానిటేషన్, రోడ్లు, తాగునీరు, డ్రైనేజీ తదితర అంశాలపై గ్రామీణ, పట్టణ ప్రాంతాల ప్రతినిధులతో 16వ ఆర్థిక సంఘం సభ్యులు సౌమ్యకంతి ఘోష్, జాయింట్ సెక్రటరీ ఎస్.గౌతమ్, డైరెక్టర్ పి.సంతప్‌కుమార్, పిఆర్ అండ్ ఆర్‌డి అడిషనల్ కమిషనర్ ఎం.సుధాకర్‌రావు, కలెక్టర్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్, నగర పాలక సంస్థ కమిషనర్ మౌర్య పాల్గొన్నారు. గ్రామాల అభివృద్ధికి మరిన్ని నిధులు కేటాయించడం వల్ల గ్రామాలు అభివృద్ధి చెందే అవకాశం ఉందన్నారు. టైడ్, అన్‌టైడ్ నిధులు వేరుగా కాకుండా ఒకే మొత్తంలో నిధులు కేటాయించాలని కోరారు. 2011 జనాభా లెక్కల ప్రాతిపదికన కాకుండా ప్రస్తుత జనాభా ప్రాతిపదికన నిధులు కేటాయించాలని తెలిపారు. రాష్ట్రంలోని పలు ప్రాంతాల సర్పంచులు, జడ్‌పిటిసిలు, ఛైర్మన్లు పాల్గొన్నారు. జడ్‌పి సిఇఒ రవికుమార్‌నాయుడు, డిప్యూటీ సిఇఒ జుబేదా, డిపిఒ సుశీలదేవి, శ్రీసిటీ జనరల్ మేనేజర్ చంద్రమౌళి, ఆర్థిక సంఘం సెక్షన్ అధికారులు రాజశేఖర్, భూషణరావు, సిద్దయ్య పాల్గొన్నారు.

16వ ఆర్థిక సంఘం సభ్యులకు వినతి



సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్ సూపర్

తిరుపతి నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో తూకివాకంలో నిర్వహిస్తున్న ఇంటిగ్రేటెడ్ సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్ ప్లాంట్ నిర్వహణ బాగుందని 16వ ఆర్థిక కమిషన్ సభ్యులు సౌమ్య కంతి ఘోష్, సెక్రటరీ గౌతమ్ అల్లాడ అన్నారు. గురువారం ఉదయం తూకివాకం నందలి చెత్త నుంచి సంపద కేంద్రాన్ని కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్, కమిషనర్ మౌర్యతో కలిసి పరిశీలించారు. ఘన వ్యర్థాల నిర్వహణ, తడి చెత్త నిర్వహణ కంపోస్టు, బయో మెథనైజేశన్ ప్లాంట్, భవన నిర్మాణ వ్యర్థాల నిర్వహణ తదితర యూనిట్ల నిర్వహణ గురించి తిరుపతి కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్ ఎస్, తిరుపతి మున్సిపల్ కమిషనర్ మౌర్య పలు అంశాలు వివరించారు. ప్లాస్టిక్ వ్యర్థాలను సిమెంట్ ఫ్యాక్టరీలకు విక్రయిస్తారని, తడి చెత్తను కంపోస్టు ఎరువుగా మార్చి రైతులకు, ఉద్యానవనాలకు విక్రయిస్తారన్నారు. మార్కెట్, హోటళ్ల నుంచి సేకరించిన వ్యర్థాలను వంట గ్యాస్ ఉత్పత్తి చేస్తారన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ చరణ్ తేజ్ రెడ్డి, సూపరింటెండెంట్ ఇంజినీర్ శ్యాంసుందర్, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్ పాల్గొన్నారు.

వేమన విజ్ఞానకేంద్రంలో మోడల్ డిఎస్సి ఎగ్జామ్స్

ప్రజాశక్తి - తిరుపతి సిటి

వేమన విజ్ఞాన కేంద్రంలో 18న డిఎస్సీ మెగా మోడల్ ఎగ్జామ్ 1, 25వ తేదీ మోడల్ ఎగ్జామ్ -2 జరుగుతాయని, రెండు పరీక్షలూ రెండు ఆదివారాల్లో ఉదయం 9.30 గంటలకు నిర్వహిస్తున్నట్లు ప్రధాన కార్యదర్శి మల్లారపు నాగార్జున ఓ ప్రకటనలో తెలిపారు. ఏడేళ్లుగా ఉపాధ్యాయ నియామకాల కోసం ఎదురుచూస్తున్న అభ్యర్థులకు ఊరట కల్పించేలా రాష్ట్ర ప్రభుత్వం 16,768 పోస్టులు భర్తీ చేయడానికి నోటిఫికేషన్ జారీ చేసినట్లు తెలిపారు. జూన్ 6 నుంచి జులై 6 వరకు డిఎస్‌సి పరీక్షలు జరగనున్నాయని తెలిపారు. ఈ నేపథ్యంలో వేమన విజ్ఞాన కేంద్రం అభ్యర్థుల సామర్థ్యాన్ని పరీక్షించుకోడానికి అనుభవజ్ఞులైన అధ్యాపకులచే రూపొందించిన సిలబస్‌తో డిఎస్‌సి మెగా మోడల్ ఎగ్జామ్ సెకండరీ గ్రేడ్ టీచర్లకు నిర్వహిస్తోందని తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఇతర వివరాలకు 8985080370, 966584759 9398000686 నంబర్లలో సంప్రదించాలని కోరారు.


బాలికపై అత్యాచారం హత్య కేసులో..

నిందితుడు బాలకిషోర్ ఖర్వార్ అరెస్ట్

ప్రజాశక్తి -రామచంద్రపురం (చంద్రగిరి)

చంద్రగిరిలోని రాజేష్‌నాయక్ కుమార్తె సోనీ కుమారిని అత్యాచారం చేసి, ఆపై హత్య చేసి తప్పించుకుని పారిపోయిన జార్ఖండ్‌కు చెందిన వలస కార్మికుడు బాల్‌కిషోర్ ఖర్వార్‌ను చంద్రగిరి పోలీసులు అరెస్టు చేశారు. ఈనెల 3వ తేదీ తన కుమార్తె కనిపించడం లేదని తండ్రి రాజేష్‌నాయక్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు దర్యాప్తు చేస్తుండగా బాలిక సోనీ కుమారి ఎం.కొంగరవారిపల్లి సమీపంలోని జగనన్న కాలనీకి సమీపంలోని ఓ గుట్టపై చెట్టుకింద శవమై కనిపించింది. అప్పటికే బాలకిషోర్‌పై అనుమానంతో పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. జిల్లా ఎస్పీ హర్షవర్ధనరాజు సూచనల మేరకు నిందితుని ఆచూకి కనుగొని అరెస్టు చేశారు. బాలికకు తినుబండారాలు ఆశచూపి తల్లిదండ్రుల నుంచి అపహరించి అటవీ ప్రాంతానికి తీసుకెళ్లి అత్యాచారం చేసిన సందర్భంలో ప్రాణాలు కోల్పోయినట్లు తెలిపారు. నిందితున్ని కోర్టుకు హాజరుపరిచారు. నిందితుని పట్టుకోవడంలో ప్రతిభ కనబరచిన పోలీసులకు నగదు రివార్డును డిఎస్‌పి ప్రసాద్ అందజేసి అభినందించారు.





తిరుమల భద్రతపై డిఐజి సమావేశం

తిరుమల భద్రతపై ఉన్నతస్థాయి సమీక్ష

ప్రజాశక్తి -తిరుమల

తిరుమల భద్రతపై తిరుమలలోని అన్నమయ్య భవన్‌లో గురువారం ఉన్నతస్థాయి సమావేశం జరిగింది. ఈ సమావేశానికి పోలీసు శాఖ, టీటీడీ, ఇతర భద్రతా విభాగాల ఉన్నతాధికారులు హాజరయ్యారు. అనంతపురం రేంజ్ డీఐజీ డా.షెమూషి అధ్యక్షతన ఈ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా డీఐజీ మాట్లాడుతూ ఇటీవల పహల్గాం ఉగ్ర దాడి ఘటన నేపథ్యంలో తిరుమల ఆలయంలో భద్రతను మరింత బలోపేతం చేయడమే భద్రతా ఆడిట్ ఉద్దేశ్యం అని పేర్కొన్నారు. అన్ని భద్రతా దళాలు, టీటీడీ విభాగాల సమన్వయంతో పనిచేస్తూ, భక్తుల మనోభావాలను కాపాడటమే ప్రధాన లక్ష్యంగా ఉండాలన్నారు. అంతకు ముందు టీటీడీ ఇన్‌ఛార్జి సీవీఎస్వో, తిరుపతి అర్బన్ ఎస్పీ హర్షవర్ధన్ రాజు 2023 మే నెలలో నిర్వహించిన భద్రతా ఆడిట్ సమీక్షలో చేసిన ప్రతిపాదనలు, అలాగే ఇటీవల ఏర్పడిన పరిస్థితుల ఆధారంగా చేపట్టాల్సిన మార్పులు అనే విషయాలపై పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా సుదీర్ఘంగా వివరించారు. అలాగే ఏపీఎస్పీ, డీఏఆర్, ఎస్పీఎఫ్, హోం గార్డులు, సివిల్ పోలీసు, టీటీడీ భద్రతా సిబ్బంది వంటి అన్ని భద్రతా దళాలను సమన్వయ పరచి ప్రతి ఒక్క దళానికి స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్స్ రూపొందించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ప్రైవేట్ సెక్యూరిటీ సిబ్బంది సహా అన్ని యాక్సెస్ కంట్రోల్ బందాలకు తగిన శిక్షణ ఇవ్వాల్సిన అవసరముందని అన్నారు. తలకోన, మామండూరు, తుంబురు తీర్థం, మంగళం మార్గాలు సహా శేషాచల అటవీ ప్రాంతానికి చెందిన 14 ప్రవేశ ద్వారాలలో భద్రతను మరింత పటిష్టం చేయాలని సూచించారు. అలాగే భద్రతా సిబ్బందికి రసాయన, జీవ, కిరణ, అణు ముప్పులపై శిక్షణ, యాంటీ సాబటేజ్ చర్యలు, మాక్ డ్రిల్లులు, ఎవాక్యుయేషన్ డ్రిల్లులు వంటి అంశాలపై శిక్షణ ఇవ్వాలని సమావేశంలో నిర్ణయించారు. ఈ సమావేశంలో గ్రేహౌండ్స్ (కమాండర్) ఎస్పీ డా. గరుడ్ సుమిత్ సునీల్, ఐఎస్‌డబ్ల్యూ ఎస్పీ అరిఫ్ హఫీజ్, తిరుపతి డీఎఫ్ఓ వివేక్ ఆనంద్ పాల్గొన్నారు.

తిరుపతి రైల్వే స్టేషన్‌లో ఫ్లాగ్ మార్చ్

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

రైల్వే రక్షణ దళం (ఆర్‌పీఎఫ్), ప్రభుత్వ రైల్వే పోలీస్ (జీఆర్‌పీ), ఇతర రైల్వే అధికారులు, రైల్వే మిత్రులతో కలిసి తిరుపతి రైల్వే స్టేషన్‌లో విజయవంతంగా ముగిసిన సైనిక ఆపరేషన్ ఆపరేషన్ సిందూర్ పురస్కరించుకొని ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. దేశీయ రక్షణ సాంకేతిక శక్తిని కొనియాడుతూ, ఈ ఆపరేషన్ సింధూర్ లో పాలుపంచుకున్న ప్రతి ఒక్క సైనికుడికి సాంఘీభావం తెలుపుతూ, ప్రతి భారతీయుడు గర్వించదగ్గ విషయమని నినాదాలు తెలియజేస్తూ, భారతీయ జాతీయ జెండాను పైకి ఎగరవేస్తూ ఈ ఫ్లాగ్ మార్చ్ ను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సందీప్ కుమార్ ఇన్స్పెక్టర్ ఆర్పిఎఫ్, అశీర్వాదం ఇన్స్పెక్టర్ జి ఆర్ పి, ఎస్సైలు రాంబాబు, రామకష్ణ, రత్నమాల పాల్గొన్నారు .

ఆర్‌ఎంఎస్ సేవలను కొనసాగించండి : ఎంపి

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

రాయలసీమ ఎక్స్‌ప్రెస్‌లో టిపి-25 ఆర్‌ఎంఎస్ విభాగాన్ని నిలిపివేసిన కేంద్ర తపాలా శాఖ నిర్ణయంపై తిరుపతి ఆర్‌ఎంఎస్ డివిజన్‌కు చెందిన పోస్టల్ ఉద్యోగులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మార్పు తిరుపతి ప్రాంతంలో తపాలా సేవలపై ప్రతికూల ప్రభావం చూపుతుందని వారు అభిప్రాయపడ్డారు. మౌలిక సదుపాయాలు, వ్యూహాత్మక ప్రాధాన్యత ఉన్న తిరుపతి ఆర్‌ఎంఎస్ డివిజన్‌కు ఈ నిర్ణయం అన్యాయమని పేర్కొన్నారు. ఈ మేరకు ఉద్యోగులు తిరుపతి పార్లమెంట్ సభ్యుడు మద్దిల గురుమూర్తికి వినతి పత్రం సమర్పించారు. దీనిపై వెంటనే స్పందించిన ఎంపీ గురుమూర్తి కేంద్ర తపాలా, కమ్యూనికేషన్ల మంత్రిత్వ శాఖ కార్యదర్శికి లేఖ రాశారు. ఈ లేఖపై తపాలా శాఖ కార్యదర్శి స్పందిస్తూ, టిపి -25 ఆర్‌ఎంఎస్ విభాగం తపాలా మార్పిడికి పరిమిత స్థాయిలోనే ఉపయోగపడుతోందని, తిరుపతి, సికింద్రాబాద్ స్టేషన్ల మధ్య మాత్రమే తపాలా మార్పిడి జరుగుతుందని, మధ్యలో ఉన్న స్టేషన్లలో తపాలా మార్పిడి తక్కువ పరిమాణంలో జరుగుతోందని తెలిపారు.



జేసీకి వినతిపత్రం ఇస్తున్న భగత్‌రవి


ఆర్‌ఐఓను సస్పెండ్ చేయాలి : ఎస్‌ఎఫ్‌ఐ

ప్రజాశక్తి - క్యాంపస్

రాష్టంలో ఇంటర్ విద్యలో సంస్కరణలు తీసుకొచ్చి ముందుగానే ఏప్రిల్ 1 నుంచి తరగతులు మొదలు పెట్టి, 24 నుంచి జూన్ 1 వరకు వేసవి సెలవులు ఇచ్చిందని, తిరుపతి జిల్లాలో మాత్రం బోర్డ్ నిబంధనలు పాటించేలా ఆర్ఐఓ విఫలం చెందారని, తక్షణమే ఆర్ఐఓ ను సస్పెండ్ చేయాలనీ ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి భగత్‌రవి విమర్శించారు. ఈ మేరకు జేసీకి గురువారం వినతిపత్రం సమర్పించారు. జిల్లాలో బోర్డు నిబంధనలు పాటించకుండా తరగతులు నిర్వహిస్తున్న కళాశాలల్లో విద్యార్థులను మానసిక ఒత్తిడి నుంచి కాపాడాలన్నారు. గతంలో ఆర్ఐఓ దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోలేదన్నారు. విద్యార్థులు కొంతమంది తమకు సోషల్ మీడియాలో తెలియజేశారన్నారు. మానసిక ఒత్తిడి నుంచి కాపాడాలని, సెలవులు కావాలని ప్రతిరోజూ మెసేజ్‌లు పంపుతున్నారన్నారు. జిల్లాలో ఇంటర్ బోర్డు నిబంధనలు పాటించని కళాశాలలపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు వినోద్,నగర కార్యదర్శి తేజ, జిల్లా నాయకులు శివ పాల్గొన్నారు.

ఆర్‌కేఈ ఇసుజు 3ఎస్ ఫెసిలిటి ప్రారంభం

ప్రజాశక్తి -తిరుపతి సిటీ



ఆంధ్రప్రదేశ్‌లో తన ఉనికిని మరింత బలోపేతం చేసే ప్రక్రియలో, ఇసుజు మోటార్స్ ఇండియా తిరుపతిలో ఆర్‌కేఈ ఇసుజు 3ఎస్ ఫెసిలిటిని ప్రారంభించింది. రేణిగుంట రోడ్డు ఆటోనగర్ సమీపంలోని నారాయణ హాస్పిటల్ వద్ద జరిగిన కార్యక్రమంలో ఇసుజు మోటార్స్ ఇండియా డిప్యూటీ మేనేజింగ్ డైరెక్టర్ తోరు కిషమోటో మాట్లాడుతూ తిరుపతి తమకు అత్యంత ముఖ్యమైన మార్కెట్ అని, ఒక కొత్త షోరూమ్‌తో తమ ఉనికిని బలోపేతం చేసేందుకు సంతోషిస్తున్నాము. ఆర్‌కేఈ ఇసుజు సుమారు 10 సంవత్సరాలుగా ఒక విశ్వసనీయమైన భాగస్వామిగా ఉందన్నారు. ఆర్ కే ఈసుజు డీలర్ ప్రిన్సిపాల్ బాలాజీ చౌదరి తిరుపతిలో ఈ కొత్త షోరూమ్ తో కొత్త స్థాయిలకు తీసుకెళ్ళడం తమకు ఎంతో గౌరవంగా ఉందన్నారు. ఇసుజు అందించే కొత్త వాహన శ్రేణిని వినియోగదారుల సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

'నిఘా'తో దేశానికి రక్షణ

18న ఉపగ్రహ ప్రయోగానికి షార్ సిద్ధం

ప్రజాశక్తి-సూళ్లూరుపేట

భారతదేశ భద్రతే లక్ష్యంగా ఇస్రో మరో నిఘా ఉపగ్రహ ప్రయోగానికి సిద్ధమవుతోంది. ఈనెల 18న శ్రీహరికోటలోని సతీష్ ధావన్ అంతరిక్ష కేంద్రం మొదటి ప్రయోగ వేదిక నుంచి ఈఓఎస్09 ఉపగ్రహాన్ని ప్రయోగించేందుకు శాస్త్రవేత్తలు సిద్ధమయ్యారు. భారత్‌కు ఎంతో పేరు ప్రఖ్యాతలు తీసుకొచ్చిన పోలార్ సాటిలైట్ లాంచ్ వెహికల్ (పిఎస్ఎల్వి) ద్వారా ఈ ఉపగ్రహ ప్రయోగం జరుపుతున్నారు. పిఎస్ఎల్వి -సి 61 పేరుతో రాకెట్‌ను నాలుగు దశలుగా నిర్మించారు. గత ఏడాది చివరిలో పిఎస్ఎల్వి -సి 60 రాకెట్ ప్రయోగం జరిగిన తర్వాత ఐన్నాళ్లకు మరో పిఎస్ఎల్వి రాకెట్ షార్ నుంచి ప్రయోగించనున్నారు. మధ్యలో ఇస్రో 100వ రాకెట్ జిఎస్ఎల్వి ఎఫ్ -15ను ప్రయోగించి ఉన్నారు. ఇదిలా ఉంటే సరిహద్దుల్లో ఇటీవల నెలకొన్న కొన్ని ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో ఇస్రో ఈ నిఘా ఉపగ్రహం అవసరాన్ని గుర్తించి చక చకా ఏర్పాట్లతో ప్రయోగం చేసేందుకు సిద్ధమైంది. ఇక్కడ ఉన్న అన్ని రాకెట్ నిర్మాణ దశల సౌకర్యాలను ఉపయోగించుకుని పిఎస్ఎల్వి సి 61ని నిర్మాణపరంగా పనులు పూర్తి చేశారు. ఈ ఉపగ్రహ లక్ష్యం ఏదైనప్పటికీ ప్రస్తుతం అవసరమైన ఉపగ్రహం.దీనికి తగ్గట్లే ఇస్రో చైర్మన్ వి.నారాయణన్ ఇటీవల ఒక కార్యక్రమంలో మాట్లాడుతూ ఇస్రో ప్రయోగాల వలన దేశానికి రక్షణ సేవలు కూడా అందుతున్నాయని ప్రకటించి ఉన్నారు. ఇప్పటికే 10 ఉపగ్రహాలు అంతరిక్షం నుంచి తమ పని తాము చేసుకు పోతున్నట్లు ఆయన పేర్కొన్నారు. ప్రస్తుతం ఇఓఎస్ 09 పేరుతో ప్రయోగిస్తున్న భూ పరిశీలన ఉపగ్రహం కూడా అత్యంత శక్తివంతంగా సరిహద్దు ప్రాంతాలను అందులో ఉగ్రవాద కదలికలను పసిగట్టే సామర్థ్యం కలిగి ఉందని ఇస్రోవర్గాలు పేర్కొంటున్నాయి. వచ్చే ఐదేళ్లలో కనీసం 52 నిఘా ఉపగ్రహాలను భూ కక్షలోకి ప్రవేశపెట్టి భారతీయ రక్షణ రంగానికి విలువైన సేవలు అందిస్తామని ఇస్రోవర్గాలు తెలిపి ఉన్నాయి. ఈ ఉపగ్రహాలు శత్రువుల పనితీరును పసిగట్టేందుకు సరిహద్దులను పరివేక్షించేందుకు సైనిక కార్యకలాపాల సమయంలో త్రివిధ దళాలకు సాయపడేందుకు ఉపయోగపడతాయని ఇస్రోవర్గాల నుంచి సమాచారం. అందుకే ప్రస్తుతం ఉపగ్రహ ప్రయోగంపై దేశం మొత్తం ఆసక్తిగా ఎదురు చూస్తోంది. మరోవైపు షార్ లో భద్రత ఏర్పాట్లు కొనసాగుతున్నాయి. ఇటీవల సిఐఎస్ఎఫ్ దళాలు స్థానిక పోలీసుల సమన్వయంతో మాక్ డ్రిల్ నిర్వహించారు. యుద్ధ వాతావరణం ప్రస్తుతం లేదని భావిస్తున్న షార్ ను మరింత భద్రత కల్పించి కంటికి రెప్పలా కాపాడుకుంటున్నారు. దేశ భద్రతను కాపాడు కోవాలంటే దేశంలోని 7వేల కిలోమీటర్ల సువిశాల సముద్ర తీర ప్రాంతాన్ని నిరంతరం పర్యవేక్షించాలని అత్యాధునిక ఉపగ్రహాల డ్రోన్ల సాంకేతిక పరిజ్ఞానం లేకపోతే అనేక వ్యూహాత్మక లక్ష్యాలను మనం చేరుకోలేమని ఇస్రో చైర్మన్ నారాయణ ఇప్పటికే స్పష్టం చేశారు. ఈఓఎస్09 ఉపగ్రహం రీషాట్ 1బి సేవలు అందించనుంది. రీషాట్ 1 ఎ ఇప్పటికే ఉపగ్రహం అంతరిక్షం నుంచి మన దేశ రక్షణ కార్యక్రమాలు పర్యవేక్షిస్తుంది. ఎటువంటి వాతావరణం పరిస్థితులలో అయినా భూ ఉపరితలాన్నీ అత్యంత స్పష్టతతో కూడిన ప్రజల్యాషన్ ఫోటోలను తీసి పంపే సామర్థ్యం ఈ ఉపగ్రహానికి ఉంది. ఇందులో అమర్చిన సి బ్యాండ్ సింథటిక్ అపార్చ్ రాడార్ ప్రధాన ప్రత్యేకత కాగా, ఈ రాడార్ సాయంతో పగలు లేదా రాత్రి అనే తేడా లేకుండా సునిశిత విశ్లేషణ చేసే సామర్థ్యం ఈ ఉపగ్రహంలోని ఉపకరణాలకు ఉంది. కేంద్ర సైన్స్ అండ్ టెక్నాలజీ పార్లమెంటరీ స్థాయి సంఘం సభ్యులు ఉపగ్రహాన్ని ఉపగ్రహ ప్రయోగాన్ని వీక్షించేందుకు శ్రీహరికోటకు రానున్నట్లు తెలిసింది. ఈ ఉపగ్రహ ప్రయోగ ప్రాధాన్యత దష్ట్యా మరి కొంతమంది వీఐపీలు ఇస్రో చైర్మన్ తో పాటు ఇతర సీనియర్ శాస్త్రవేత్తలు రాకెట్ ప్రయోగ సమయంలో షార్ లోనే ఉండబోతున్నారు.



మూఢనమ్మకాలను విడనాడాలి : జెవివి

ప్రజాశక్తి- రేణిగుంట

'ప్రజలు మూఢనమ్మకాలను విడనాడి, శాస్త్రీయంగా ఆలోచించాలి' అని జనవిజ్ఞాన వేదిక అధ్యక్షులు రెడ్డెప్ప అన్నారు. రేణిగుంట బాయ్స్ హైస్కూల్లో గురువారం మండల సమావేశం జరిగింది. కుప్పస్వామి అధ్యక్షత వహించారు. రెడ్డెప్ప మాట్లాడుతూ సామాజిక మాధ్యమాలు మూఢభావాలవైపు దూసుకెళుతున్నాయని, మనుష్యుల ఆలోచనలను కలుషితం చేస్తున్నాయని, జనవిజ్ఞాన వేదిక వాస్తవాలను ప్రజలకు తెలిపి ఆలోచింపజేయాల్సిన కర్తవ్యంగా ముందుకెళుతోందన్నారు. సీనియర్ నాయకులు బిర్లానాయుడు మాట్లాడుతూ తొమ్మిది రకాల పాఠశాలల విధానాన్ని ప్రవేశపెట్టి విద్యా వ్యవస్థను గందరగోళం చేస్తూ పిల్లలకు విద్యను దూరం చేస్తున్నారన్నారు. ప్రజానుకూలంగా విద్యారంగంలో మార్పులు ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు రఫీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మండల కమిటీ ఏర్పాటయ్యింది. మండల కార్యదర్శిగా కె.కుప్పస్వామి, అధ్యక్షులుగా అల్లాబక్ష్, ఉపాధ్యక్షులు కవిత, ఇమామ్, సహాయ కార్యదర్శులుగా షంషేర్‌ఖాన్, రుషీశ్వర్, కమిటి సభ్యులు రామ్‌కార్తీక్, ఒ.వెంకటరమణ, ఇమామ్‌ఖాన్, బ్రహ్మమ్ ఎన్నికయ్యారు.

టీటీడీ ట్రస్ట్‌లకు భారీగా విరాళాలు

ప్రజాశక్తి - తిరుమల టిటిడి ట్రస్టులకు దాతలు భారీగా విరాళాలను అందించారు. దాత అమెరికా బోస్టన్‌కు చెందిన ఎన్ఆర్ఐ భాగవతుల ఆనంద్ మోహన్ టిటిడి ఛైర్మన్ బిఆర్ నాయుడిని తన క్యాంపు కార్యాలయంలో కలిసి విరాళ డిడిని అందజేశారు. ఎస్వీ ప్రాణదాన ట్రస్టుకు కోటి వెయ్యి నూట పదహార్లు, ఎస్వీ గోసంరక్షణ ట్రస్టు, ఎస్వీ విద్యాదాన ట్రస్టు, ఎస్వీ వేద పరిరక్షణ ట్రస్టుకు, ఎస్వీ సర్వశ్రేయాస్ ట్రస్టుకు పది లక్షల వెయ్యి నూటపదహార్ల చొప్పున విరాళాన్ని దాత అందజేశారు. దాతను బిఆర్ నాయుడు అభినందించారు.

ఘనంగా మధుసూదన్ రెడ్డి జన్మదిన వేడుకలు



కేక్ కటింగ్ కార్యక్రమంలో బియ్యపు మధుసూదన్ రెడ్డి, నాయకులు

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి జన్మదిన వేడుకలు శ్రీకాళహస్తి నియోజకవర్గం వ్యాప్తంగా గురువారం ఘనంగా జరిగాయి. గురువారం స్థానిక వైసిపి కార్యాలయంలో కార్యకర్తలు, అభిమానులు సమక్షంలో బియ్యపు మధుసూదన్ రెడ్డి కేక్ కట్ చేసి స్వీట్లు పంచిపెట్టారు. పలువురు ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం పలుచోట్ల సామాజిక సేవా కార్యక్రమాలు చేపట్టారు. తనకు అధికారం మాత్రమే పోయిందని, అభిమానం మాత్రం అలాగే ఉందంటూ అక్కడికి తరలివచ్చిన కార్యకర్తలు, అభిమానులనుద్దేశించి మధుసూదన్ రెడ్డి అన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ సిపాయి సుబ్రమణ్యం, మాజీ ట్రస్ట్ బోర్డ్ చైర్మన్ అంజూరు శ్రీనివాసులు, వడ్డపంగల్ బాలాజీ ప్రసాద్ రెడ్డి, జయ కృష్ణారెడ్డి తదితర వైసీపీ నేతలు పాల్గొన్నారు.

పుట్టినరోజు సందర్భంగా చీరల పంపిణీ

ప్రజాశక్తి -ఏర్పేడు: మాజీ శాసనసభ్యులు బియ్యపు మధుసూదన్ రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకొని గురువారం ఏర్పేడు మండలం, పెన్నగడం గ్రామపంచాయతీ, కొత్త కాల్వ ఎస్టి కాలనీ మహిళలకు వైఎస్ఆర్సిపి సీనియర్ నాయకులు మాజీ ఎంపిటిసి చెంబేటి మనిరత్నం రెడ్డి, బందారుపల్లి మునిక్రిష్ణారెడ్డి చీరలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ దగ్గోలు ప్రవంత, శ్రీధర్, యుగంధర్, హరిదాస్ రెడ్డి, మణి పాల్గొన్నారు.

చలివేంద్రం తాగునీటిలో మట్టి, పురుగులు



కుండలో నీటి అడుగున మట్టి, మలినాలు

ప్రజాశక్తి-సూళ్లూరుపేట: సూళ్లూరు పేట మున్సిపల్ సిబ్బంది ఏర్పాటు చేసిన చలివేంద్రం త్రాగునీటిలో పురుగులు, మట్టితో కలుషిత నీరు ఉండటంతో పాదచారులు తాగేందుకు పనికిరావడం లేదు. చలివేంద్రంలో తాగునీరు సక్రమంగా పోస్తున్నారా లేదా? నీరు పరిశుభ్రంగా ఉన్నాయా లేదా? అని పట్టించుకునేవారు లేరు. ఆ నీటిని త్రాగిన ప్రజలు రోగాల బారిన పడి ఆసుపత్రి పాలవుతున్నామని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇకనైనా సంబంధిత అధికారులు శుద్ధి నీటిని ఏర్పాటు చేయవలసినదిగా కోరుతున్నారు.

అపరిశుభ్రంగా రైల్వే స్టేషన్ పరిసరాలు



ప్రజాశక్తి - బాలాయపల్లి: శ్రీకాళహస్తి ఆర్పిఎఫ్ ఎస్ఐ సుభాని తన సిబ్బందితో కలిసి గురువారం వెండోడు రైల్వే స్టేషన్ పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వెండోడు రైల్వేస్టేషన్ పరిధి, జయంపు గ్రామస్తులు రైల్వే గేట్ నుండి వెండోడు రైల్వే స్టేషన్ బోర్డు వరకు చెత్త చెదారాలు పోస్తుండటంతో పరిసరాలు అపరిశుభ్రంగా మారాయన్నారు. జంతు, మానవ విసర్జితాలతో దుర్వాసన వెదజల్లుతోందని తెలిపారు. రైల్వే గ్యాంగ్ పనిచేయు కార్మికులు ఆ పరిసరాల్లో పనులు చేయాలంటే ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. ట్రాక్ మీదకు మూగ జీవాలు వదిలేస్తున్నారని, తరచు అవి రైళ్లు ఢీకొనడంతో మృత్యువాత పడుతున్నాయన్నారు. రైల్వే పరిసరాలను అపరిశుభ్రం చేస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని, ట్రాక్ పై మూగ జీవాలను వదలడం నిషేధమని ఆయన హెచ్చరించారు.

శ్రీ శివాని విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న కరస్పాండెంట్ శివకుమార్ రెడ్డి

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : పాలిటెక్నిక్ ప్రవేశ పరీక్ష పాలిసెట్లో గూడూరు, శ్రీ శివాని స్టడీ సర్కిల్ విద్యార్థులు రాష్ట్రస్థాయిలో ప్రతిభ కనబరిచారు. ఈ సందర్భంగా కరస్పాండెంట్ శివకుమార్ రెడ్డి మాట్లాడుతూ120 మార్కులకు గాను శ్రీ శివాని విద్యార్థులు ఎం లిఖిత 99, సాయి దేవ హర్ష 95, వంశీ 91, పద్మావతి 89, వేణు 88, మిథిలేష్ రెడ్డి 82, సుహైల్ 78, వసీమ్ అహ్మద్ 76, యశ్వంత్ 74, శ్రీ సంతోష్ 70 మార్కులు సాధించారని, 28 మంది విద్యార్థులు రాష్ట్ర ర్యాంకులు సాధించినట్లు తెలిపారు. ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు విద్యార్థులను అభినందించారు.

ఎస్ఎస్ఆర్ అకాడమీ విద్యార్థుల ప్రతిభ



జ్యోతీశ్వర్



వైష్ణవి

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: రాష్ట్ర ప్రభుత్వం గురువారం విడుదల చేసిన ఏపీ ఆర్జీసెట్ ఫలితాల్లో పట్టణంలోని ఎస్ఎస్ఆర్ అకాడమీ విద్యార్థులు ప్రతిభ చాటారు. బైపిసి విభాగంలో శ్రీవైష్ణవి రాష్ట్ర వ్యాప్తంగా 1562వ ర్యాంక్, ఎంపీసీ విభాగంలో జ్యోతీశ్వర్ 1818వ ర్యాంక్ సాధించి అకాడమీ పేరు తీసుకొచ్చారు. ఏపీ ఆర్జీసెట్ పరీక్షల్లో ప్రతిభ చాటిన విద్యార్థులను, అందుకు దోహదపడిన అధ్యాపకులను అకాడమీ నిర్వాహకులు జి.మునిబాబు, కృష్ణ అభినందించారు.

'అభ్యంతరకర పాటను తొలగించాలి'

ప్రజాశక్తి-తిరుపతి (మంగళం): తిరుమల శ్రీవారి భక్తుల మనోభావాలు దెబ్బతిన్న లాగా తమిళ సినిమా డిడి నెక్స్ట్ లెవెల్ చిత్రం నుండి అభ్యంతరకర పాటను తొలగించాలని, లేనిపక్షంలో చిత్రం రిలీజ్ను అడ్డుకుంటామని జనసేన పార్టీ నాయకులు బత్తెన మధుబాబు హెచ్చరించారు. గురువారం తిరుపతి ప్రెస్ క్లబ్లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దీనిపై టిటిడి కూడా వెంటనే స్పందించి చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ విలేకరుల సమావేశంలో హిమవంత్, వజీర్ పాల్గొన్నారు.

హాస్టల్, పీహెచ్సీల తనిఖీ

ప్రజాశక్తి - దొరవారిసత్రం: దొరవారిసత్రం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, ప్రభుత్వ బాలికల హాస్టల్ను సూళ్లూరు పేట ఆర్డీవో కిరణ్మయి గురువారం తనిఖీ చేశారు. గత నెలలో కలెక్టర్ తనిఖీ నిర్వహించి, లోపాలపై అధికారులను మందలించారు. ఆర్డీవోను శ్రద్ధ చూపాలని ఆదేశించారు. ఆయన ఆదేశం మేరకు ఆర్డీవో కిరణ్మయి తనిఖీలు చేశారు. హాస్టల్, పిహెచ్సీ నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో తాసిల్దార్ శైల కుమారి, ఎ ఎస్ ఉమ్మయ్య, వార్డెన్, డాక్టర్ చైతన్య ల్యాబ్ టెక్నీషియన్ మురళి, పాల్గొన్నారు.

యోగా సమ్మర్ స్పెషల్ క్యాంప్

ప్రజాశక్తి - క్యాంపస్: జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయంలో నెల రోజులపాటు ప్రత్యేక యోగ సమ్మర్ స్పెషల్ క్యాంప్ విశ్వ విద్యాలయంలోని యోగ విజ్ఞాన విభాగం ద్వారా నిర్వహించనున్నారు. ఆసక్తి ఉన్నవారు రూ. 1500 చెల్లించి, రిజిస్ట్రేషన్ చేసుకోవాలని నిర్వాహకులు తెలిపారు.

జాతరలో సామాన్య భక్తులకే ప్రాధాన్యత ఇచ్చాం




విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మబ్బు దేవనారాయణ రెడ్డి

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): తిరుపతి తాతయ్యగుంట గంగమ్మ జాతర మహోత్సవంలో సామాన్య భక్తులకు అత్యంత ప్రాధాన్యతనిచ్చి విజయవంతం చేయగలిగామని, చిన్న చిన్న పొరపాట్లను ఎత్తిచూపుతూ సొంత ప్రచారాలకు వినియోగించుకోవడం మంచి పద్ధతి కాదని టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మబ్బు దేవనారాయణ రెడ్డి పేర్కొన్నారు. గురువారం తిరుపతి ప్రెస్ క్లబ్లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గంగమ్మ జాతర ప్రారంభం నుండి కూటమి ప్రభుత్వ సూచనలు సలహాల మేరకు ఎంతో జాగ్రత్తలు వహిస్తూ ఎక్కడ ఇటువంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా జాగ్రత్తలు పాటించామని, అయితే 13న ఒక్కసారిగా భక్తుల రద్దీ పెరిగి పోవడంతో కొద్దిపాటి ఇబ్బందికర వాతావరణం ఏర్పడినప్పటికీ అధికారుల సమన్వయంతో ఆ పరిస్థితిని చక్కదిద్దామన్నారు. ఏదేని పొరపాట్లు జరిగి ఉంటే బహిరంగ క్షమాపణ కోరుతున్నామన్నారు. ఎన్నడూ లేని విధంగా అభిషేకం జరిగే సమయంలో భక్తులను సర్వదర్శనానికి అనుమతించామన్నారు. గత పాలకులు చేసిన అత్యుత్సాహ సారెల ఊరేగింపు కార్యక్రమానికి ఆలయ నిధి నుండి రూ.1.5 కోట్ల రూపాయలు వినియోగించారని విమర్శించారు. రూ.15 కోట్లు ఫిక్స్ డిపాజిట్లు ఉన్న అమ్మవారి ఆలయాన్ని నాలుగున్నర కోట్ల రూపాయలు అప్పుచేసి విడిచిపెట్టారన్నారు. తాము ఆర్భాటాలకు పోకుండా సామాన్య భక్తులకు సేవలు అందించగలిగామన్నారు. ఈ విలేకరుల సమావే బట్టు రవిశంకర్ రెడ్డి, వాసు, సిద్ధారెడ్డి, అడుసుమిల్లి చంద్ర బాబు, కుమార్, విజయ, కొర్లగుంట భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

నేడు మెగా ఆక్యు ప్రెజర్ వైద్య శిబిరం ప్రారంభం

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): రోటరీ క్లబ్ తిరుపతి, రాజస్థాన్కు చెందిన రామ్ మనోహర్ లోహియా ఆరోగ్య జీవన సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో తిరుపతి, రోటరీ కార్యాలయంలో 16 నుండి 21వ తారీఖు వరకు మెగా ఆక్యు ప్రెజర్ వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు తిరుపతి రోటరీ క్లబ్ అధ్యక్షులు సోము రవికుమార్ తెలిపారు. గురువారం తిరుపతి ప్రెస్ క్లబ్లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అనుభవజ్ఞుడైన డాక్టర్ ఎంఎ చైనాన్ బృందంచే సుజోక్, వైబ్రేషన్, మాగ్నెట్ థెరపీ పద్ధతుల ద్వారా మందులు లేకుండా ఆక్యు ప్రెజర్ వైద్య విధానం ద్వారా మధుమేహం, రక్తపోటు, ఒబెసిటీ, సయాటికా నొప్పులు, థైరాయిడ్, ఉదర సంబంధిత వ్యాధులు వంటి ఆరోగ్య సమస్యలకు పరిష్కారం లభిస్తుందన్నారు. వారం రోజులకు గాను వంద రూపాయలు నామమాత్రపు ఫీజుగా తీసుకోవడం జరుగుతుందన్నారు. ఆక్యు ప్రెజర్ వైద్య శిబిరంలో చికిత్సను పొందాలనుకునేవారు 8801808464 కు ముందస్తుగా ఫోన్ చేసి రిజిస్ట్రేషన్ చేసుకోవాలని కోరారు. ఈ విలేకరుల సమావేశంలో గోవిందధామం వ్యవస్థాపకులు టెంకాయల దామోదరం, రోటరీ క్లబ్ జోన్ గవర్నర్ హేమచంద్ర మాగం, రోటరీ క్లబ్ తిరుపతి కార్యదర్శి గుంటి రాజేష్ కుమార్, రోటరీ ట్రస్ట్ పూర్వపు చైర్మన్ పురుషోత్తం పటేల్ పాల్గొన్నారు.

సీబీఎస్ఈ ఫలితాల్లో మంగళ్ విద్యాలయ విద్యార్థుల ప్రభంజనం



RAYAPATI HARSHANA | CHALLAGUNDLA VIDYA | BANDAPALLI SRAVYA | B RITHYKA | LANKIPALLI SANJANA

ప్రజాశక్తి - రేణిగుంట: సిబియస్ఈ ఫలితాల్లో, మంగళ్ విద్యాలయ విద్యార్థులు అత్యధిక మార్కులు సాధించి పాఠశాల కీర్తిని పెంచారని పాఠశాల యాజమాన్యం తెలిపారు. 12తరగతి ఫలితాల్లో ఎంపీసీలో చందన 500 మార్కులకు 456 మార్కులతో మొదటి స్థానంలో నిలిచింది. పిసిబీలో ఎల్.సంజనలి 500 మార్కులకు గాను 449 మార్కులు సాధించింది. ఎంఈసీలో పి.సంధ్యలి 500 మార్కులకు గాను 425 సాధించింది. సీఈసీలో ఆర్. హర్షణలి 500 మార్కులకు గాను 419 మార్కులు సాధించింది. అలాగే 10వ తరగతి ఫలితాల్లో కూడా విద్యార్థులు అత్యున్నత మార్కులు సాధించారు. బి రితిక 500 మార్కులకు గాను 484 మార్కులు సాధించి మొదటి స్థానంలో నిలిచింది. ద్వితీయ స్థానంలో బి దేవకీ నందన్ 479/500 మార్కులు సాధించాడు. జి.విద్య, బి.శ్రావ్య 478/500 మార్కులు సాధించి తృతీయ స్థానంలో నిలిచారు. అలాగే తెలుగులో 17మంది విద్యార్థులు, సాంఘికశాస్త్రంలో ఒకరు, నూటికి నూరు100/100 మార్కులు సాధించి పాఠశాల కీర్తిని అత్యున్నత స్థాయిలో నిలబెట్టారని ఛైర్మన్ తెలిపారు. విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ గల్లా రామచంద్ర నాయుడు విద్యార్థులకు ఉపాధ్యాయులకు తల్లిదండ్రులకు అభినందనలు తెలియజేశారని పాఠశాల ప్రిన్సిపాల్ గల్లా. ధనంజయనాయుడు తెలిపారు.

కబ్జాకు గురైన భూములకు న్యాయం

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : రూరల్ మండలం, నేషనూరు పంచాయతీ, గట్టు గ్రామం, గ్రామ కంఠం ప్రక్కన ప్రభుత్వ భూమి (మందబైలు) 59-5 సర్వే లో గల 76 సెంట్లు ప్రభుత్వ భూమి ఉంది. ప్రభుత్వ భూమిపై కన్నేసిన కొంతమంది కబ్జాదారులు, ఆ స్థలంలో ఉన్న పలు రకాలు చెట్లును కొట్టి 20 టన్నుల కలపను సొమ్ముచేసుకున్నారని స్థానికులు తెలిపారు. ఉన్నతాధికారులకు పిర్యాదు చేసినా పట్టించుకోకపోవడంతో, వారు సీఎం కార్యాలయానికి తమ ఆవేదనను వినతుల రూపంలో పంపినారు. స్పందించిన సీఎం కార్యలయం, సంబంధింత జిల్లా కలెక్టర్కు భూ కబ్జాదారులపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కలెక్టర్, కబ్జాకు సంబంధించిన సమస్యను పరిష్కరించాలని స్థానికి తాసిల్దార్ను ఆదేశించారు. ఈ సందర్భంగా పుత్తూరు ఎమ్మార్వో వెంకటేశ్వర్లు గురువారం మంద బైలు భూమిని పరిశీలించి, రెవెన్యూ అధికారులు సర్వేయర్తో సర్వే చేయించి ఆ భూమిని ప్రభుత్వ భూమిగా నిర్ధారించి స్వాధీనం చేసుకున్నారు. గ్రామకంఠం సర్వే నెంబర్ 60లో 7 ఏకరాల 30 సెంట్లు భూమి వివాదం కూడా పరిష్కరిస్తామని తెలిపారు. మంద బైలు భూమిలో చెట్లు నరికి, సొమ్ముచేసుకున్న వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేసి విచారణ చేపడతామని తెలిపారు.

ఘనంగా ఎమ్మెల్యే ఆరణి పుట్టిన రోజు వేడుకలు

ప్రజాశక్తి - తిరుపతి సిటీ : ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు పుట్టిన రోజు సందర్భంగా ఆయన నివాసం సందడిగా మారింది. గురువారం ఉదయం ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు తన పుట్టిన రోజు సందర్భంగా తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. అనంతరం జీవకోనలోని జీవలింగేశ్వర స్వామిని దర్శించుకుని జెఎంసి ట్రస్ట్ ద్వారా జీవకోనలో ఏర్పాటు చేసిన రెండు ఆర్వో వాటర్ ప్లాంట్స్ను ప్రారంభించారు. అనంతరం తన నివాసం వద్ద జనసేన నాయకులు ఏర్పాటు చేసిన కేక్ను కుటుంబ సభ్యులు, ఎన్డీఏ కూటమి నేతల కోలాహలం మధ్య కట్ చేశారు. జనసేన కార్పొరేటర్లు ఎస్కే బాబు నేతృత్వంలో ప్రత్యేకంగా కేక్ ఏర్పాటు చేసి ఎమ్మెల్యేకు శుభాకాంక్షలు తెలిపారు. అధ్యక్షులు పవన్ కళ్యాణ్ స్ఫూర్తితో ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు బొకేలు, శాలువలు వద్దని పిలుపు ఇవ్వడంతో విద్యుర్థులకు అవసరమై విద్యా సామాగ్రి, పండ్లు ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు. స్కూల్స్ తెరిచిన వెంటనే తన పుట్టిన రోజు సందర్భంగా వచ్చిన విద్యా సామాగ్రిని విద్యార్థులకు అందించనున్నట్లు ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు తెలిపారు. తిరుపతి ఎన్నికల చరిత్రలో అత్యధిక మెజార్టీతో గెలిపించిన ప్రజలకు జీవితాంతం రుణపడి ఉంటానని ఆరణి చెప్పారు. తిరుపతి అభివృద్ధికి సిఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్లు కట్టుబడి ఉన్నారన్నారు. ఆదర్శ నియోజకవర్గంగా తిరుపతిని నిలబెట్టడమే తన ముందున్న లక్ష్యమని చెప్పారు. ఈ కార్యక్రమంలో జనసేన, టిడిపి, బిజెపి నాయకులు పాల్గొన్నారు.

ఎంఎల్ఏకు సునీల్ చక్రవర్తి శుభాకాంక్షలు

తిరుపతి సిటీ : తిరుపతి శాసనసభ్యులు ఆరణి శ్రీనివాసులు జన్మదినం సందర్భంగా రాష్ట్ర రవాణా శాఖ సభ్యులు ఎం. సునీల్ చక్రవర్తి ఆయన్ను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అన్నారావు సర్కిల్ సమీపంలోని ఎంఎల్ ఏ నివాసం వద్ద అరణి శ్రీనివాసులును కలిసిన ఆయన ఎంఎల్ ఏకి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

ఆర్కాట్ 'అన్నదానం'

ప్రజాశక్తి - తిరుపతి టౌన్ : తిరుపతి శాసనసభ్యులు ఆరణి శ్రీనివాసులు పుట్టినరోజు పురస్కరించుకుని జనసేన నాయకులు ఆర్కాట్ కృష్ణప్రసాద్, ఆముదాల వెంకటేష్ ఆధ్వర్యంలో 400 మంది నిరుపేదలకు అన్నదానం నిర్వహించారు. ఆరణి జగన్ మాట్లాడుతూ తన తండ్రి తిరుపతి ఎంఎల్ఏగా ఎన్నికై సంవత్సరం కావస్తున్న సందర్భంగా ఈ పుట్టినరోజు జరుపుకోవడం సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో మహేష్యాదవ్, హరీష్ శంకర్, ఆళ్వార్ మురళి పాల్గొన్నారు.

ఉత్సాహపరచిన ప్రజానాట్యమండలి సాంస్కృతిక కార్యక్రమాలు

ప్రజాశక్తి - తిరుపతి సిటీ : ఏఐవైఎఫ్ 17వ జాతీయ మహాసభలు సందర్భంగా తిరుపతి ఇందిరా మైదానంలో జరిగిన బహిరంగ సభలో సినీ సంగీత దర్శకులు వందేమాతరం శ్రీనివాస్, ఇప్టా జాతీయ కార్యదర్శి పల్లె నర్సింహ, ప్రజానాట్యమండలి రాష్ట్ర అధ్యక్షులు చంద్ర నాయక్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిన్నం పెంచలయ్య, అనంత లక్ష్మీ, కావ్య వెంకట ప్రమోద్ కుమార్లు గానం చేసిన ఉత్సాహ భరితమైన పాటలు సభికులను అలరించాయి. జానపద కళాకారుల సంఘం అధ్యక్ష కార్యదర్శులు నారాయణదాసు, ముకుందలు కోలాటం నిర్వహించారు. ఈ కార్యక్రమాల ద్వారా యువతను ఉత్తేజపరుస్తూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు యువత పట్ల చూపుతున్న సవతి ప్రేమను ఎండగట్టారు.

తిరుమలలో ఫుడ్ సేఫ్టీ విభాగం

ప్రజాశక్తి -తిరుమల: తిరుమలలో భక్తుల ఆహార భద్రత కోసం టీటీడీ ఒక ప్రత్యేకమైన ఫుడ్సేఫ్టీ విభాగాన్ని ఏర్పాటు చేయనుంది. భక్తులకు నాణ్యమైన ఆహారాన్ని అందించడమే లక్ష్యంగా టీటీడీ చర్యలు చేపడుతోంది.తిరుమలలో ఆహారంలో కల్తీని అరికట్టడానికి, నాణ్యతను పెంచడానికి ఈ కొత్త విభాగం పనిచేస్తుంది. సంప్రదాయ ఆహార పదార్థాలను మాత్రమే విక్రయించాలని ఇటీవలే టీటీడీ అధికారులు సూచించారు. ఈ క్రమంలోనే నిరంతర తనిఖీల కోసం టీటీడీకి ప్రత్యేక ఫుడ్సేఫ్టీ విభాగాన్ని ఏర్పాటు చేయాలని నిర్ణయించారు.

అమెరికా పెన్ స్టేట్తో ఎంబియూ ఒప్పందం



మాట్లాడుతున్న అమెరికా వర్శిటీ ప్రతినిధి, వేదికపై మంచు మోహన్బాబు, విష్ణు

ప్రజాశక్తి - రామచంద్రపురం(చంద్రగిరి): తిరుపతి జిల్లా, చంద్రగిరి మండలం ఏ.రంగంపేట సమీపంలోని మోహన్ బాబు విశ్వవిద్యాలయం, అమెరికా దేశంలోని పెన్ స్టేట్ విశ్వవిద్యాలయాల మధ్య పరస్పర అవగాహన ఒప్పందం కుదుర్చుకునింది. ఈ ఒప్పందం అంతర్జాతీయ విద్య ప్రమాణాలు పెంపొందించుకోవడానికి నాంది అని ఎంబియూ ప్రో ఛాన్సలర్ మంచు విష్ణు అన్నారు. యంబీయు దాసరి ఆడిటోరియంలో ఈ పరస్పర అవగాహన ఒప్పందం గురువారం జరిగింది. ఒప్పంద పత్రాలలో మంచు విష్ణు, ఎంబియూ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వినయ మహేశ్వరి, పెన్ స్టేట్ విశ్వవిద్యాలయం ఛాన్సలర్ డాక్టర్ డేవిడ్ యం కల్లజో పర్వేజ్, వైస్ ఛాన్సలర్ డాక్టర్ వాహిద్ మోటేవల్లె సంతకాలు చేసి ఒప్పంద పత్రాలను మార్చుకున్నారు.ఈ సందర్భంగా పెన్ స్టేట్ విశ్వవిద్యాలయం కౌన్సిలర్ డాక్టర్ డేవిడ్ కల్లేజో ఫరేజ్ మాట్లాడుతూ విద్యార్థులను గ్లోబల్ ఎడ్యుకేషన్ వైపు ఈ ఒప్పందం నడిపించగలదన్నారు. వినయ్ మహేశ్వరి మాట్లాడుతూ భారత దేశ చరిత్రలో ఓ ప్రైవేటు విశ్వవిద్యాలయం అమెరికాలో 100 క్యూఆర్ ర్యాంకు కలిగిన విశ్వవిద్యాలయంతో అవగాహన ఒప్పందం చేసుకోవటం ఇదే మొదటిది అన్నారు.ఈ కార్యక్రమంలో ఎంబి యూ వైస్ ఛాన్సలర్ డాక్టర్ కరుణాకరన్, చీఫ్ గ్రోత్ అండ్ స్ట్రాటజిక్ అధికారి వికాస్ సింగ్, వివిధ శాఖల డీన్లు, శాఖాధిపతులు, అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు.

విశ్వంలో సైనిక్ స్కూల్ సమాచార పత్రిక ఆవిష్కరణ



ప్రజాశక్తి - క్యాంపస్ : స్థానిక తిరుపతి విశ్వం టాలెంట్ స్కూల్లో నూతన సైనిక్ స్కూల్కు ఎంపికైన శ్రీరామ విద్యాసంస్థల సైనిక్ స్కూల్ సమాచార పత్రికను విద్యాసంస్థల చైర్మన్ అపుస్మా రాష్ట్ర అధ్యక్షులు తులసి విష్ణుప్రసాద్, అపుస్మా నాయకులు వాసు, రాజగోపాల్ రెడ్డి, విశ్వ చందన్ రెడ్డి, రఘునారాయణ రావు, రామకృష్ణరెడ్డి, అశ్విని చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చిలుమూరు గ్రామంలోని శ్రీరామ రూరల్ విద్యాసంస్థల స్కూల్ను కేంద్ర ప్రభుత్వ రక్షణ మంత్రిత్వ శాఖ శ్రీరామ రూరల్ సైనిక్ స్కూల్గా ఎంపికైనట్లు పేర్కొన్నారు. 2025-26 విద్యా సంవత్సరం నుంచే ఈ సైనిక్ స్కూల్ ప్రారంభం కానుందని తెలిపారు. ఈ సందర్భంగా శ్రీరామ రూరల్ అకాడమీ అధ్యక్షులు మాట్లాడుతూ ప్రభుత్వ గుర్తింపు ద్వారా మా విద్యా విధానానికి గుర్తింపు లభించిందని పేర్కొన్నారు. సైనిక్ స్కూల్గా గుర్తింపు లభించడం ద్వారా విద్యార్థులకు భారత సైన్యంలో ప్రవేశించేందుకు కావాల్సిన బేసిక్ ట్రైనింగ్, శారీరక దృఢత, దేశభక్తి, నాయకత్వ లక్షణాల అభివృద్ధి వంటి అనేక అవకాశాలు లభించనున్నాయని తెలిపారు.

ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలకు 705 మంది గైర్హాజరు

ప్రజాశక్తి - తిరుపతి సిటీ : జిల్లా వ్యాప్తంగా గురువారం జరిగిన ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ పరీక్షలకు 705 మంది గైర్హాజరైనట్లు ఆర్ఐఓ ప్రభాకర్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం జరిగిన ఇంటర్మీడియట్ పబ్లిక్ అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలు - మొదటి సంవత్సరం మ్యాథమాటిక్స్ పేపర్ -2బి, జువాలజీ, హిస్టరీ, ఒకేషనల్ కోర్సులకు జిల్లా వ్యాప్తంగా 15,510 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా 639 మంది పరీక్షకు గైర్హాజం య్యారని తెలిపారు. మధ్యాహ్నం జరిగిన ద్వితీయ సంవత్సరం మ్యాథమాటిక్స్ పేపర్ -2బి, జువాలజీ, హిస్టరీ, ఒకేషనల్ పబ్లిక్ పరీక్షలకు1,555 మంది హాజరవ్వాల్సి ఉండగా జనరల్లో 62, ఒకేషనల్లో 4 మంది, మొత్తం 66 మంది పరీక్షకు గైర్హాజరయ్యారని తెలిపారు.

మైనార్టీ కార్పొరేషన్ రుణాలకు దరఖాస్తు చేసుకోండి

ప్రజాశక్తి - తిరుపతి టౌన్ :తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ 2025-26 ఆర్థిక సంవత్సరానికి గాను మైనారిటీ కార్పొరేషన్ క్రింద 72 లోన్లను కేటాయించారని, అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మే 25లోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఆసక్తిగల ముస్లింలు, సిక్కులు, బౌద్ధులు, జైన్లు, పార్శిలు, క్రైస్తవ అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు.

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : వడమాలపేట మండలంలో 2025-26 ఆర్థిక సంవత్సరానికిగాను మైనారిటీ కార్పొరేషన్ కింద 5 లోన్లు టార్గెట్గా కేటాయించారని ఎంపీడీవో శేషగిరిరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో గ్రామీణ బ్యాంకు -3, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా-1, బ్యాంక్ ఆఫ్ ఇండియా కాయంపేట బ్రాంచికి-1 కేటాయించారని తెలిపారు. 25వ తేదీ లోపల ఆన్ లైన్లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. అర్హత గల ముస్లిం, క్రైస్తవ అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

కమిషనర్కు పలువురి శుభాకాంక్షలు



ప్రజాశక్తి - నాయుడుపేట: నాయుడుపేట మునిసిపల్ కమిషనర్గా విధులు నిర్వహిస్తున్న ఎస్.కె పజిలుల్లాకు పలువురు నాయకులు, మున్సిపాలిటీ వర్కర్లు శుభాకాంక్షలు తెలియజేశారు. గ్రేడ్ 2 మున్సిపల్ కమిషనర్గా ఉన్న కమిషనర్ పజిలుల్ల గ్రేడ్1 కమిషనర్గా పదోన్నతి పొందడంతో మున్సిపల్ కార్యాలయంలో పలువురు ఆయనకు శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ క్రమంలో గురువారం స్థానిక వైసీపీ నాయకులు ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు. శుభాకాంక్షలు తెలిపినవారిలో మునిసిపల్ చైర్ పర్సన్ కటకం దీపిక, ఎంపీపీ ధనలక్ష్మి, కో ఆప్షన్ మెంబర్ చదలవాడ కుమార్, కౌన్సిలర్లు పాలేటి నాగార్జున, షేక్ షబ్బీర్, కావేరిపాకం అశోక్, 12వ వార్డు వైసిపి ఇన్చార్జ్ సాదు మోహన్లు ఉన్నారు.

వారం పాటు గరుడ వారధి సర్కిల్లో రాకపోకలు బంద్

ప్రజాశక్తి - తిరుపతి టౌన్: రామానుజ సర్కిల్ నుండి శ్రీనివాసం కాంప్లెక్స్ వరకు గరుడ వారధిపై వారం రోజుల పాటు రాక పోకల నిషేధించారు. తిరుపతిలో నిర్మించిన గరుడ వారధి ప్రాజెక్ట్కు సంబంధించి ప్రతి సంవత్సరం చేపట్టే వార్షిక పనుల తనిఖీ లో భాగంగా 16 నుండి 21 వ తేదీ వరకు ఫ్లై ఓవర్ పై స్పాను లోడ్ టెస్ట్ నిర్వహించనున్నారు. వాహన దారులు, ఆర్టీసీ అధికారులు, ప్రజలు మునిసిపల్ కార్పొరేషన్ అధికారులకు, ట్రాఫిక్ పోలీస్ అధికారులకు సహకరించాలని మున్సిపల్ కమిషనర్ ఒక ప్రకటనలో కోరారు.

గ్రామీణ సడక్ యోజన ద్వారా నిధులు మంజూరు

ప్రజాశక్తి - సత్యవేడు: టిడిపి తోనే సుస్థిరమైన గ్రామీణ అభివృద్ధి సాధ్యమని టిడిపి సత్యవేడు మండల అధ్యక్షులు ప్రవీణ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని వా నెల్లూరు రోడ్డు నిర్మాణానికి ప్రధానమంత్రి గ్రామీణ సడక్ యోజన పథకం ద్వారా కోటి రూపాయలు మంజూరు అయినట్లు ఆయన తెలిపారు. ఇదివరకే 1.5 కిలో మీటర్లు మేర మట్టి రోడ్డు ఉండగా పిఎంజిఎస్వై పథకం ద్వారా తారు రోడ్డు నిర్మాణం చేపట్టనున్నట్లు తెలిపారు.

క్రైం న్యూస్

గంజాయి రవాణా.. మహిళలు అరెస్ట్

ప్రజాశక్తి - రేణిగుంట: విశ్వసనీయ సమాచారం మేరకు, రేణిగుంట ఎస్డిపిఓ శ్రీనివాసరావు పర్యవేక్షణలో, రేణిగుంట సీఐ ఎస్. జయచంద్ర సిబ్బందితో కలిసి రేణిగుంట రైల్వే స్టేషన్ దగ్గర, ఎబిఎస్ లాడ్జ్ రూమ్ నెంబరు 207లో తనిఖీలు నిర్వహించారు.ఈ తనిఖీల్లో పశ్చిమ బెంగాల్కు చెందిన మమోని మొండాల్ (31), నమితా మొండాల్ (37) అనే ఇద్దరు మహిళలను అదుపులోకి తీసుకొని, విచారించి వారి వద్ద నుండి రెండు సూట్కేసులలో 24.500 కిలోగ్రాముల గంజాయి (7 ప్యాకెట్లు), అంచనా విలువ రూ. 2,45,000/- స్వాధీనం చేసుకున్నారు. విచారణలో వారు గంజాయిని ఒడిశా నుండి తీసుకొని కేరళకు తీసుకెళుతున్నట్లు అంగీకరించారు. ముద్దాయిలపై కేసు నమోదు చేసి రిమాండ్ నిమిత్తం తరలించారు.

పిడుగుపాటుకు ఆవు మృతి



ప్రజాశక్తి - యర్రావారిపాలెం: మండలంలో గురువారం కురిసిన అకాల వర్షానికి పిడుగు పడటంతో ఒక ఆవు మృతి చెందింది. కూరపర్తివారిపల్లి పంచాయతీ, గంపల మాదిగపల్లికి చెందిన బోయన వెంకటరమణ అనే రైతుకు చెందిన ఆవు పొలంలో మేస్తుండగా సాయంత్రం పడిన పిడుగుల వర్షానికి పాడి ఆవు అక్కడికక్కడే మృతి చెందడం జరిగింది. పాడి ఆవుపై ఆధారపడి జీవనం సాగిస్తున్నానని ఆవు మృతి చెందడంతో జీవనం కోల్పోయానని ప్రభుత్వం సహాయం చేసి ఆదుకోవాలని రైతు ప్రాదేయపడ్డారు.

వైసీపీ కార్పొరేటర్పై టిడిపి నాయకుల దాడి



గాయపడ్డ అనిల్ కుమార్, అతని తల్లి



పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే భూమన

ప్రజాశక్తి - తిరుపతి సిటీ: టీడీపీకి చెందిన రత్నం, అతని కుమారుడు విజయ్లు గురువారం తిరుపతి 50 వ డివిజన్ కార్పొరేటర్ అనిల్ కుమార్పై దాడి చేసి, విచక్షణ రహితంగా కొట్టారు. అడ్డొచ్చిన అనిల్ తల్లిపై కూడా దాడి చేశారు. గాయపడిన అనిల్, ఆయన తల్లిని స్థానికులు, కుటుంబ సభ్యులు వెంటనే రుయా ఆసుపత్రికి తరలించారు. తీవ్ర గాయాలు పాలైన అనిల్ ప్రస్తుతం చికిత్స పొందుతున్నారు. గురువారం సాయంత్రం వైసీపీ జిల్లా టిటిడి మాజీ చైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డి అనిల్ కుమార్ను ఆసుపత్రికి వచ్చి పరామర్శించి, ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ ఇలాంటి ఘటనలు రోజు రోజుకూ పెరిగిపోతుండటం చాలా ప్రమాదకరమన్నారు. తక్షణమే బాధ్యులపై చర్యలు తీసుకుని ప్రజల భద్రతకు పోలీసులు గట్టి భరోసా ఇవ్వాలని కోరారు.

దశరధాచారి జన్మదిన వేడుకలు



ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గుమ్మడిపూడి దశరధాచారి జన్మదిన వేడుకలు గురువారం పట్టణంలో ఘనంగా జరిగాయి. టిడిపి కార్యకర్తలు, నాయకులు భారీ కేక్ కట్ చేసి ఆయనకు శుభాకాంక్షలు తెలియజేశారు. రెడ్డివారి గురవారెడ్డి, మిన్నల్ రవి, గాలి మురళి నాయుడు, గుర్రప్పశెట్టి, నివేదిత మోరె, ఉమేష్ రావు పాల్గొన్నారు.

డాక్టర్ పసుపులేటి హరిప్రసాద్కు సన్మానం



హరిప్రసాద్ను సన్మానిస్తున్న తపసి మురళి రెడ్డి

ప్రజాశక్తి - రామచంద్రపురం (చంద్రగిరి): ఉమ్మడి చిత్తూరు జిల్లా జనసేన అధ్యక్షులు డాక్టర్ పసుపులేటి హరిప్రసాద్, ఆంధ్రప్రదేశ్ హస్తకళల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్గా ఎన్నికైన సందర్భంగా చంద్రగిరి నియోజకవర్గం జనసేన సీనియర్ నాయకులు గురువారం మర్యాద పూర్వకంగా కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా చంద్రగిరి జనసేన సీనియర్ నాయకులు తపసి మురళి రెడ్డి మాట్లాడుతూ పార్టీ కోసం అహర్నిశలు కష్టపడిన హరి ప్రసాద్కుపై హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జనసేన సీనియర్ నాయకులు పొర్లు దండాల ఈశ్వర్ రాయల్, దండు లక్ష్మీపతి, కార్యకర్తలు, వీర మహిళలు పాల్గొన్నారు.

నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యం

ప్రజాశక్తి - బుచ్చినాయుడు కండ్రిగ: సత్యవేడు నియోజకవర్గం, బుచ్చినాయుడు కండ్రిగ మండలంలో గురువారం ఉదయం మండల అభివృద్ధి అధికారిణి వెంకటరత్నమ్మ, ఎంపీపీ మేకల సుబ్బలక్ష్మిల ఆధ్వర్యంలో సర్వసభ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా సత్యవేడు శాసనసభ్యులు కోనేటి ఆదిమూలం విచ్చేశారు. ఆయన మాట్లాడుతూ సత్యవేడు నియోజకవర్గంలోని ఏడు మండలాల్లో ఎక్కువగా బుచ్చినాయడు కండ్రిగ మండలం అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తానని స్పష్టం చేశారు. అధికారులు పాఠశాలలు, స్మశాన సమస్యలపై దృష్టి సారించారలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల అధికారులు, ప్రజాప్రతినిధులు, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పరిసరాల శుభ్రత అందరి బాధ్యత

ప్రజాశక్తి - బుచ్చినాయుడు కండ్రిగ: బుచ్చినాయుడు కండ్రిగ గ్రామ పరిసరాల శుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని, శుభ్రంగా ఉంటేనే ఆరోగ్యంగా ఉంటారని ఎంపీడీఓ వెంకటరత్నమ్మ తెలిపారు. స్వచ్ఛాంధ్ర-స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో భాగంగా గురు వారం ఎంపీడీఓ కార్యాలయ అవరణలో చెత్తా, చెదారాన్ని పారిశుధ్య కార్మికులచే తొలగించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ కార్యాలయాల ఆవరణ శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ప్రతి ఒక్కరూ కనీసకొక మొక్క నాటాలని, మొక్కలు నాటడం వలన పర్యావరణాన్ని పరిరక్షించవచ్చని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఏఓ త్రివిక్రమావు, పారిశుద్ధ్య కార్మికులు పాల్గొన్నారు.

గుడిమల్లం శివయ్య సేవలో ప్రముఖులు

ప్రజాశక్తి-ఏర్పేడు: గుడిమల్లం పరశురామ స్వామివారి సేవలో గురువారం ఎస్ బీమ్స్ రెడ్డి, రాకేష్ రెడ్డి, బిఎస్ చౌదరి రెడ్డి పాల్గొన్నారు. వీరికి ఆలయ మాజీ చైర్మన్ బత్తుల గిరి నాయుడు స్వాగతం పలికి స్వామివారి దర్శనం చేయించారు. తదుపరి మండపంలో వేద పండితులచే ఆశీర్వచం ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వీరు మాట్లాడుతూ ఆలయ అభివృద్ధికి తమ వంతు సహాయం చేస్తామని హామీ ఇచ్చారు.

ఘనంగా డాక్టర్ రవి రాజు జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : అఖిల భారతీయ క్షత్రియ మహాసభ, పుత్తూరు వారిచే డాక్టర్ రవిరాజు 63వ జన్మదిన వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. అనంతరం 400మందికి ఐస్ క్రీమ్స్ పంపిణి చేసారు. ఈ కార్యక్రమంలో అఖిల భారతీయ క్షత్రియ మహాసభ అధ్యక్షులు చంద్రశేఖర్ రాజు, ప్రధాన కార్యదర్శి కోనేటిరవిరాజు, యూత్ ప్రెసిడెంట్ బాలసుబ్రమణ్యం రాజు, ఆర్గనైజింగ్ సెక్రటరీ కే.చంద్రబాబు తిరుపతి జిల్లా అధ్యక్షులు రామచంద్రరాజు, ట్రెజరర్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.